క్లుప్తంగా

వడమాలలో అపరిశుభ్రత


వడమాలలో పాచి పట్టి ఉన్న కాలువ

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలం వడమాలలో మురికి కాలువ అధ్వానంగా ఉంది. ఎక్కడ మురికి అక్కడే నిలిచి దుర్వాసన వస్తోంది. పూడికతీత పనులు చేపట్టకపోవడంతో నీళ్లు పాచి పట్టింది. నిలిచి ఉన్న నీటిలో చిన్నచిన్న పాములు సంచరిస్తున్నాయి. అంతే కాకుండా దోమలు విపరీతంగా ఉన్నాయని, రాత్రి పూట కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమ కాటుతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, అసలు ఇంత వరకు గ్రామానికి పంచాయతీ కార్యదర్శి వచ్చిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు


భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్

పాలసముద్రం: మండల పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమించకుండా రెవెన్యూ సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. గురువారం టీవీఎన్ ఆర్ పురం, తిరుమలరాజుపురం, నరసింహపురం తమిళనాడు సరిహద్దులో ప్రతి రోజు జేసీబీతో ప్రభుత్వం భూములను అక్రమంగా చదును చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఆమె తన సిబ్బందితో కలసి అక్రమంగా ప్రభుత్వం భూములు చదును చేస్తున్న ప్రదేశాలను పరిశీలించారు. చదును చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ దేవి, మండల సర్వేయర్ గణేష్, వీఆర్ఓలు శ్రీనివాసన్, రమేష్, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగు పరచాలి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్పీఓ, ఎంపీడీఓ

గంగాధరనెల్లూరు: గ్రామాల్లో పారిశుధ్యమే లక్ష్యంగా పనిచేయాలని డీఎల్పీఓ పార్వతమ్మ అన్నారు. గురువారం గంగాధరనెల్లూరు కొట్రకొన, పెద్ద కాలువ, వేల్కూరు, కోటాగరం, తూ గుండ్రం ముక్కలతూరు, ఆత్మకూరు, ఆంబోదరపల్లి తదితర గ్రామాలలో ప్రత్యేకంగా చేపడుతున్న పారిశుధ్యం, పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమాలలో ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూడో శనివారం స్వచ్ఛ దివస్


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో

నగరి: పంచాయతీల్లో ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ దివస్‌గా పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు అన్నారు. గురువారం నగరి, నిండ్ర, విజయపురం మండలాలలో ఆయన పర్యటించారు. స్థానిక వెలుగు సమావేశ మందిరంలో నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలతో ఆయన సమావేశమయ్యారు. ఫిబ్రవరి 15వ తేదీలోపు గ్రామాల్లోని చెత్తసేకరణ కేంద్రాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్, నగరి, నిండ్ర, విజయపురం ఈవోపీఆర్డీలు అరుణమ్మ, లక్ష్మీపతి, రాజేంద్రన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బంది బాధ్యతగా పని చేయాలి


పీహెచ్‌సీలో డీఐఓ హనుమంతురావు

పాలసముద్రం: ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా పని చేయాలని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి హనుమంతురావు తెలిపారు. గురువారం సాక్షి దినపత్రికలో ప్రసవంలోనే శిశువు మృతి, వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ప్రచురితమైన వార్తకు స్పందించిన డీఎమ్‌హెచ్‌ఓ సుధారాణి ఆదేశాల మేరకు పాలసముద్రం పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరిగితే తప్పకుండా చర్యలు ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ల్యాబ్ రూమ్, గర్భిణీలు, బాలింతలకు, పిల్లలకు వేస్తున్న టీకాల రిజిస్టర్‌ని తరవుగా పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సునీల, మురళి ఉన్నారు.

సరికొత్తగా.. సాగు

నిత్యావసరాలైన కూరగాయల ధర మార్కెట్‌లో నిలకడగా ఉంటుండడంతో మండలంలోని అధిక శాతం రైతులు ఆయా పంటల సాగు పై దృష్టి సారించారు. మండలంలోని రైతులు వివిధ రకాల కూరగాయలు వందలాది ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వంగ, బెండ, బీర, కాకర, చిక్కుడు, పచ్చిమిర్చి తదితర కూరగాయలు విరివిగా పండిస్తున్నారు.

–నిండ్ర

- కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి
- మండలంలో వివిధ రకాల కూరగాయల పంటలు
- మార్కెట్‌లో ధర నిలకడతో రైతాంగం హర్షం


సాగులో ఉన్న వంగ


మిరప పంట

ప్రతి సంవత్సరం రబీ సీజన్‌లో అధికంగా కూరగాయలు పంటలు సాగు చేస్తారు. వంగ, బెండకు అనుకూలంగా ఉన్నందున రబీ, ఖరీఫ్‌లో కూడా సాగు చేస్తుండడంతో రైతులకు మద్దతు ధర రావడంతో రైతు ఆశించిన అదాయం లభిస్తోంది. ముఖ్యంగా వంగ కేజీ రూ.40 పలుకుతుండడంతో రైతుకు ఆదాయం లభిస్తోంది. అదే విధంగా బెండకాయలు ధర రూ.60 వరకు ఉంటోంది. మార్కెట్‌లో ప్రతి నిత్యం ధరలు పెరుగుతుండడంతో రైతులు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గతంలో మండలంలోని కొన్ని గ్రామాల్లోనే కూరగాయలు పండించే వారు. ప్రస్తుతం ధరలు ఉండడంతో ప్రతి గ్రామంలో చిన్న రైతు కూడా కూరగాయలు సాగు చేస్తున్నారు.

ఆకు కూరలకు డిమాండ్

ఆకుకూరల ధర గత నెల నుండి విపరీతంగా పెరిగింది. వర్షాలు పడడంతో కూరాకు విత్తనాలు చల్లిన ప్రతి రైతు నష్టాల పాలయ్యారు. కూరాకు విత్తనాలు వేసిన తరువాత వర్షం పడకుండా ఉండాలి. అప్పుడే అవి చక్కగా మొలకెత్తుతాయి. చల్లిన 15 రోజులకే కోతకు వచ్చి మార్కెట్‌లో అమ్మవచ్చు. గత నెల రోజులుగా తరచూ వర్షాలు పడుతుండడంతో నీరు చేరి విత్తనాలు పూర్తిగా నాశనమయ్యాయి. దీంతో ఆకు కూరలకు డిమాండ్ పెరిగింది. కట్ట రూ.20 నుంచి రూ.25గా ఉంది. దీంతో రైతులు గత వారం రోజులుగా ఆకు కూరల సాగుపై అధికంగా దృష్టి సారించారు.

బెండ, వంగ అధిక దిగుబడులు

మండలంలోని ప్రతి గ్రామంలో రైతులు వంగ, బెండ తోటలు సాగు చేస్తున్నారు. పంట దిగుబడిని ప్రతి రోజు రైతులు తమిళనాడులోని చెన్నై మార్కెట్‌కు తరలిస్తుండడంతో రైతులకు ఆశించిన ఆదాయం లభిస్తోంది. కేజీ ధర 40 రూపాయలు ఉండడంతో లాభాలు గడిస్తున్నారు. ఈ పంటలకు సస్యరక్షణ చర్యలు తప్పని సరిగా చేపట్టాలి. లేకుంటే చీడ పురుగులు అధికంగా చేరి పంటకు నష్టం కలిగిస్తాయి. దీంతో రైతులు వారానికోసారి తప్పనిసరిగా సూచించిన మందులను వాడాల్సి ఉంటుంది. దీంతో పంట నాణ్యతగా ఉండడంతోపాటు దిగుబడి లభిస్తుంది.

సంతకు కూరగాయలు

రైతులు సాగు చేసిన వివిధ రకాల కూరగాయలను చిన్న రైతులు సమీపంలో జరిగే సంతల్లో అమ్ముతున్నారు. కోసిన వెంటనే మార్కెట్ చేయడంతో రైతులకు తక్షణం ఆదాయం వస్తుంది. మార్కెట్‌కు తరలించడంతో వారం రోజుల తరువాత రైతులకు డబ్బులు చేరుతాయి. ఇవికాకుండా వారే స్వయంగా సంతలో అమ్మడంతో ధర అధికంగా అమ్ముకోవడంతో డిమాండ్ బట్టి ధరలు పలుకుతాయి.


కూరగాయ పంటలకు మందుల పిచికారీ

కూరగాయల సాగుతో ఆదాయం



వివిధ రకాల కూరగాయల పంటలు సాగు చేయడంతో ఎంతో ఆదాయం. సరైన మందులు వాడితే దిగుబడి బాగుంటుంది. మార్కెట్‌లో కూరగాయలు ధర ఆశించిన మేరకు ఉండడంతో లాభాలు వస్తున్నాయి. అందు కోసం కూరగాయలు సాగు చేయడంపై ఆసక్తి చూపుతున్నాం.

–కార్తీక్, రైతు, మిట్టకండ్రిగ

నష్టాలు ఉండడం లేదు



కూరగాయల పంటలు సాగు చేస్తుండడంతో మాకు ఎలాంటి నష్టాలు లేవు. మార్కెట్‌లో ధరలు నిలకడగా ఉన్నాయి. దీంతో దిగుబడి తగ్గినా మాకు ఎలాంటి నష్టాలు లేకుండా కూరగాయల పంటలతో ఆదాయం పొందుతున్నాం. సీజన్‌కు తగినట్లుగా పంటలు సాగు చేసుకుంటున్నాం.

–మునిరాజ్, రైతు, అత్తూరు

ఇసుక డంప్ సీజ్


సరిహద్దులో సీజ్ చేసిన ఇసుకతో ఎస్‌ఐ

సాక్షి ఎఫెక్ట్..

విజయపురం: మండలంలోని నార్పరాజు కండ్రిగ తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో డంప్ చేసిన ఇసుకను ఎస్‌ఐ బలరాం గురువారం సీజ్ చేశారు. సుమారు 10 ట్రాక్టర్ల ఇసుక డంప్ చేసినట్లు ఆయన గుర్తించి సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ‘రెచ్చిపోతున్న ఇసుక మాఫియా’ శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించి ఎస్‌ఐ తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీ చేశారు. తమిళనాడుకు ఇసుక తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోండి


పాడి పశువులకు వైద్య పరీక్షలు

కార్వేటినగరం: మండలంలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు డిప్యూటీ డైరెక్టర్ గోవిందయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ ఇందిరమ్మ తెలిపారు. గురువారం కార్వేటినగరం ద్రౌపదమ్మ గుడి ఆవరణలో పశు వైద్యాధికారి హేమకుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆవు, దూడలకు నట్టల నివారణ మందులు పిచికారీ చేశారు. 180 మంది పాడి రైతులకు 300 పాడి పశువులకు వైద్యం చేశారు. పాడి పశువులకు అన్నింటికీ డీవార్మింగ్ మందులు తాగించారు. కార్యక్రమంలో వెదురుకుప్పం అడిషనల్ డైరెక్టర్ రూపసుందరి, వెటర్నరీ అసిస్టెంట్లు రమేష్, ముని శేఖర్, సుశీల్, పరంధామ, రుపేష్, శరణ్య పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి


ఎంపీడీఓ మోహన్‌మురళి

శ్రీరంగరాజపురం: బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం అందించే రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండల కార్యాలయంలో ఎంపీడీఓ మోహన్‌మురళి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా మండలానికి 61 యూనిట్లు రాయితీ రుణాలు మంజూరయ్యాయన్నారు. అర్హులైన బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు కులస్తులు అర్హులన్నారు. దరఖాస్తూ చేసుకోవడానికి వయస్సు 21 సంవత్సరం నుంచి 50 వరకు ఉండాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 4 లక్షల నుంచి గరిష్ఠంగా 25 లక్షలు వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులు క్యాస్ట్ సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆధార్, ఫొటో, బ్యాంక్ పాసు పుస్తకంతో apobmmr.apcfrr.in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ఫారంను మండల కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ


ఎరువులను తనిఖీ చేస్తున్న ఏడీ మధుసూదన్‌రెడ్డి

కార్వేటినగరం: శ్రీరంగరాజపురం మండలంలోని వ్యవసాయ ఎరువు దుకాణాలను వ్యవసాయ శాఖ ఏడీ మధుసుదన్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అందించాలన్నారు. ఎరువులకు సంబంధించిన క్రయవిక్రయాలను ఎప్పటికప్పుడు రికార్డు పుస్తకంలో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయధికారి నర్మద, వ్యవసాయధికారులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి


నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి

గంగాధర నెల్లూరు: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే చెల్లించాలని, సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు ఖాతాలో మరో వెన్నుపోటు ప్రజలను పొడిచారని గంగాధరనెల్లూరు వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మీ ధ్వజమెత్తారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతి ఒక్కరికి విద్య అందాలని ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశ పెట్టారన్నారు. రాజన్న కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి ఆశయాలు కనుగుణంగా విద్యా వ్యవస్థలు విప్లవాత్మకమైన మార్పులు అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన, జగనన్న గోరుముద్ద, జగనన్న సంపూర్ణ ఆహారం తదితర విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి చెందుతుందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఎందుకు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదని ప్రశ్నించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన పాత బకాయిలను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలతో కలసి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. విద్యార్థి జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ కూటమి ప్రభుత్వానికి త్వరలోనే రాష్ట్ర ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేకుంటే తీవ్ర పరిణామం ఉంటాయని హెచ్చరించారు. తప్పుడు మేనిఫెస్టోతో సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో అబద్ధాలు చెప్పి ప్రజలను నయవంచన చేసిన చంద్రబాబు మరొక్కసారి ప్రజలకు వెన్నుపోటు పొడిచాడని విమర్శించారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

పుత్తూరు: దేశభక్తికి, క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి అన్నారు. గురువారం కళాశాలలో ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో కవాతు ప్రదర్శనలో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు జె.శేషాద్రి, ఎం.సముగ, పి.లావణ్యలకు అభినందన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మన విద్యార్థులు రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు అందుకోవడం కళాశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ కోటేశ్వరయ్య, వీరయ్య, ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ సుధాకర్‌రావు

కార్వేటినగరం: స్వచ్ఛ దివస్‌లో భాగంగానే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీఓ సుధాకర్‌రావు తెలిపారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీరడంతోపాటు చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం


అప్పలాయగుంటలో కల్యాణోత్సవం

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణం రోజున స్వామివారికి కల్యాణం జరిపించడం ఆనవాయితీ. పద్మావతి, ఆండాల్ సమేత శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని పట్టు పీతాంబరాలు, పూలమాలలతో నూతన వధూవరులుగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యుల ఆధ్వర్యంలో అగ్నిహోమం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ వేదమంత్రాలతో మాంగల్య ధారణ చేయించారు. మంగళ హారతులిచ్చారు. కళ్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. బెంగళూరుకు చెందిన మాధవరాజు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్, టీటీడీ సిబ్బంది, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

గుండెపోటు నివారణే లక్ష్యం


మాట్లాడుతున్న మెడికల్ సూపరింటెండెంట్

నగరి: గుండెపోటు నివారణే లక్ష్యంగా ఆస్పత్రిలో ఉన్న స్టెమీ యూనిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యూహెచ్ జరీనా అన్నారు. ఆస్పత్రి సమావేశ హాలులో పేషెట్లకు, అటెండెంట్లకు, మహిళలకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలోని స్టెమీ యూనిట్‌లో గత ఏడాది 33 మందికి టెనెక్ట్‌ప్లేస్ ఇంజక్షన్ వేశామని 27 మంది ప్రాణాలు కాపాడామన్నారు. పెరుగుతున్న మరణాల రేటును తగ్గించే లక్ష్యంతో ఆరోగ్య శాఖ ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏఎస్ఎంలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ఈ వ్యవస్థ గురించి తెలియజేస్తూ, గుండెపోటు లక్షణాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్డియాక్ అరెస్ట్‌తో బాధపడుతున్న వ్యక్తిని గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా ఏరియా ఆస్పత్రికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ మంజుల, వైద్యులు కార్తీక్, ప్రవీణ, దీప్తివదన, శ్రీనాథ్, లోకేష్, జయంత్, మోనిక, జ్యోత్స్న, స్పందన, నర్సింగ్ సూపరింటిండెంట్ రాజరత్నమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీకళాశాలకే ప్రాధాన్యత



ఓపెన్ డే కార్యక్రమంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

నగరి: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు డిగ్రీ చదువులకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రిన్సిపల్ వేణుగోపాల్ కోరారు గురువారం ఓపెన్‌డే కార్యక్రమంలో భాగంగా ఇంటర్మీడియట్ కళాశాలలను సందర్శించి అక్కడి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా ఉందన్నారు. విశాలమైన డిజిటల్, వర్చువల్ తరగతి గదులు, జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎన్‌సీసీ, కంప్యూటర్ లాబ్స్, సైన్స్ లాబ్స్, గ్రంథాలయం, విశాలమైన ఆటస్థలం ఉందన్నారు. ఉద్యోగ మేళా నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.

రికార్డులు సక్రమంగా నమోదు చేయాలి


అవగాహన కల్పిస్తున్న ఐకేపీ ఏపీఎం

పాలసముద్రం: మండలంలోని డ్వాక్రా సంఘాల వారు తమ రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఆర్‌పీ, సీసీఎఫ్, స్త్రీనిధి రికవరీ, ఆరోగ్య పోషణపైఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. కల్పలత మాట్లాడుతూ స్త్రీనిధి ద్వారా ఇప్పుడు 10 మంది సభ్యులకు వచ్చే రూ.5 లక్షలు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి అప్పులపై సామాజిక తనిఖీ కూడా నిర్వహిస్తామన్నారు. ఏ రకమైన అప్పు తీసుకున్నా 100 శాతం రికవరీ చేయాలన్నారు. డ్వాక్రా గ్రూపులకు, సిబ్బందికి రికార్డులు రాయడం, స్త్రీనిధి రికవరీపై అవగాహన కల్పించారు. సీసీ చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, మంజుల, బాలయ్య, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణకు కృషి


కుష్టు వ్యాధిపై ర్యాలీ


కుష్టు వ్యాధిపై పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ

విజయపురం: కుష్టు వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సోమశేఖర్ అన్నారు. గురువారం జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం సందర్భంగా మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి తొలిదశలో చికిత్స చేయడం ద్వారా నివారించవచ్చున్నారు. జనవరి 20 నుంచి ఫిబ్రవరి 2 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో తమ సిబ్బంది సర్వే నిర్వహించి కుష్టు వ్యాధి రోగులను గుర్తిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో కుష్టువ్యాధి నివారణపై ర్యాలీ

గంగాధరనెల్లూరు: జాతీయ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గంగాధరనెల్లూరు ఆరోగ్య కేంద్రం నుండి డాక్టర్ దుర్గాదేవి ఆధ్వర్యంలో కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తూ వైద్య సిబ్బందితో కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.